# ధ్యేయం

-దూరి వెంకటరావు

పదవీ విరమణ నా పాలిట శాపంగా మారింది. ఉద్యోగంలో ఉన్నన్నాళ్ళు చేతినిండా పని ఉండడం వల్లనేమో కాలం ఇప్పుడు నత్తనడకలా సాగుతోంది. విజయనగరంలో నాకు చెప్పుకోదగ్గ స్నేహితులెవరూ లేరు. ఒంటరితనం నన్ను మరింత బాధిస్తోంది. ఐడిల్ మ్యాన్స్ బ్రెయిన్ ఈజ్ డెవిల్స్ వర్క్‌షాప్ అన్నారు. ఏ వ్యాపకం లేకపోతే మనిషికి వెర్రిమొర్రి ఆలోచనలొస్తుంటాయి. అందుకే సాయంత్రం వేళ కాస్త కాలక్షేపంగా ఉంటుందని ఆంజనేయస్వామి కోవెలకెళ్ళడం అలవాటు చేసుకున్నాను.

గుడికెదురుగా భక్తులు కూర్చునేందుకు సిమెంట్ సోఫాలున్నాయి. అవి ఎప్పుడు ఎవరు కట్టించారో తెలీదు. అడపాతడప వాటికి మరమ్మతులు జరిపించి రంగులు వేస్తుండడంతో అవి నిత్యనూతనంగా అగుపిస్తుంటాయి. రోజూ దైవదర్శనానంతరం అక్కడ కాస్సేపు కూర్చోడం నా దినచర్యలో భాగమై పోయింది. కోవెల కోనేరు గట్టున ఉండడం వల్ల చెరువులో నీటిమీంచి వచ్చే చల్లని గాలి మనసుకెంతో ఉల్లాసాన్నిస్తుంది.

ఎప్పటిలాగే ఆవేళ కూడ గుడికెదురుగా ఉండే సిమెంటు గట్టుమీద కూర్చున్నాను. మంగళవారం అవడం వల్ల భక్తులతో కోవెల కిటకిటలాడుతోంది. ఆలయ మార్గంలో రోడ్డుకిరువైపులా బిచ్చగాళ్ళు గుడ్డలు పరుచుకుని భక్తులు విదిల్చే చిల్లర కోసం కళ్లప్పగించి చూస్తున్నారు.

గత రెండు వారాల నుండి గమనిస్తున్న ఓ చిత్రమైన వ్యక్తి ఈ మంగళవారం కూడ కనిపిస్తాడేమోనని చూశాను. అతడు ఆరడుగుల ఆజానుబాహుడు. గిరిజాల జుట్టు, బుర్రమీసం, గంభీరమైన ముఖం, ఎంతో హుందాగా ఉంటాడు. అయితే ఒక చెయ్యి చచ్చుబడి పోవడం వల్ల అంగవైకల్యం స్పష్టంగా కనబడుతోంది. వచ్చీరాగానే ఆ వ్యక్తి ఓ పసివాడి చేత బిక్షగాళ్ళందరికి కరెన్సీ నోట్లు పంపిణీ చేయించాడు. బహుశా ఆ పిల్లాడు తన మనవడై ఉంటాడనుకున్నాను. కాని నా భావన పొరపాటని ఆ తరువాత తేలింది. అదెలా అంటే, మొన్నటి మంగళవారం అతడు నన్ను చూడటంతోనే "అయ్యా! తమరీ నోట్లు ఆ బిచ్చగాళ్ళకు పంచిపెడతారా?" అన్నాడు జేబులోంచి వంద రూపాయల కట్ట తీస్తూ.

విస్తుపోయాన్నేను.

యాత్రాస్థలాల్లో, గుడిగోపురాల వద్ద భక్తులు యాచకులకు చిల్లర రాల్చడం సహజం. కాని ఇలా వంద రూపాయల నోట్లు పంచడం నేనెక్కడా చూడలేదు. కొంపతీసి అవి దొంగనోట్లు కాదు కదా!.. అంతలోనే నా భావన నాకే ఎబ్బెట్టుగా తోచింది. దొంగనోట్లు ముద్రించేవాళ్ళు, వక్రమార్గాన ధనార్జన చేసేవాళ్ళు కార్లు, మేడలు కొనలనుకుంటారే తప్ప అనాథలకు దానంచేసి వాళ్ళని ఆదుకోవాలనుకోరు. అయితే అతడి కళ్ళల్లో మాత్రం ధర్మకార్యం చేస్తున్నానన్న సంకల్పమే గోచరిస్తోంది.

"దానం, ధర్మం అనేవి ఎవరి చేత్తో వారు చేస్తేనే వారికి దాని ఫలితం దక్కుతుంది. ఇతరులతో చేయించడం వల్ల మీకొరిగేదేమీ ఉండదు" అని నా అభిప్రాయం చెప్పాను.

"ఎందుకో చెప్పలేను, మిమ్మల్ని చూస్తుంటే ఈ మంచిపని మీచేత చేయించాలనిపిస్తోంది" అన్నాడు మరింత అభ్యర్థనగా.

అది వట్టి అబద్ధం.

ఇందులో ఏదో తిరకాసుంది. గత వారం ముక్కు మొహం తెలియని పసివాడి చేత డబ్బు పంచిపెట్టించాడు. ఇవాళ అతగాడికి నేను దొరికాను. రేపు మరొకరిని చూసుకుంటాడు. 'ఇలా ఎందుకు చేస్తున్నాడా'

## గాలిపటము

ఆ.వె: ఎదురు గాలిలోన నెగురుతు నెప్పుడు
కలతజెందనట్టి గాలిపటము
ఎదుగు కాలమందు నెదురవు కష్టముల్
మంచి కొఱకె యనుచు మారుపలికె

చందమామ వరకు ౘక్కగా సాగేటి
కమ్మనైన రంగు గాలిపటము
మమత మాలొ నింపి మహిలోన మంచిని
వెలుగు నటులజేయు కలిమితోడ.

-సి. శ్రీ.

అన్న సందేహం నా బుర్రను తొలిచేస్తోంది."

నేనేమీ అనకపోవడంతో అతడి నుంచి మళ్ళీ అదే అభ్యర్థన.

మరీ బెట్టు చేస్తే బావుండదని అతడి కోరిక మేరకు కరెన్సీ నోట్లు బిచ్చగాళ్ళందరికీ పంచిపెట్టాను.

నోట్ల పంపిణీ పూర్తిచేసి వెనక్కి తిరిగి చూసేసరికి ఆ వ్యక్తి అదృశ్యమయ్యాడు. మళ్ళీ ఈ వారం కనబడక పోతాడా అని ఇవాళ పెందలాడే వచ్చి గుడిముందు తిష్టవేశాను. అతడినుండి అసలు విషయం రాబట్టా లన్నదే నా ఆదుర్దా అంతా. ఎంచేతనో ఎదురు చూస్తున్న వ్యక్తి మరి పికర్లేదు.

"ఎవరి కోసం అంత దీక్షగా చూస్తున్నారు" వీపు చరిచి అడిగారు రాజారాంగారు.

ఆయన ఏదో మండలంలో ఎమ్మార్వోగా పనిచేసి రీసెంటుగా ప్రమోషన్ మీద ఈ ఊరొచ్చి మా ఇంటి ప్రక్కనే దిగారు. సుమారుగా నా వయసే అతనికి

## సంక్రాంతి లక్ష్మీ వైభవం

ఏమని పొగడుదు ఈ హేమంత విలాసం
ఎల్లెడలా హరిత హరిద్ర సమ్మోహక ఇంద్రజాలం!
అణువణువునా అంతులేని నవ్యత్వం
అంతటా సంక్రాంతి లక్ష్మీ వైభవ విభవం.

అరుదెంచెనదిగో అల్లనల్లన అతివ పౌష్యలక్ష్మి
అంచితముగ సస్యశ్యామల పట్టుపుట్టంబుగట్టి
నీలాంబర శ్వేతాంబర పుష్పంబుల
మరువంపుతో గూర్చి కట్టిన మాలను సిగనుజుట్టి
పండు మిరప రంగు దోసపలుకు తిలకము
వదనమున వింత కాంతులీన
చిట్టి చేమంతుల చిరుదవనముతో గలిపి కట్టిన
హారమును కంఠమున ధరించి
బంగరు వన్నియల బంతి గుత్తుల ఒడ్డాణము
నెన్నడుము బెట్టి
నీలివర్ణపు నీహారపు మేలిముసుగు గప్పి
రంగు రంగుల ముత్యాల ముగ్గుల రథమునెక్కి
వీధివీధిన జనుల సంతస సంబరమ్ముల వీక్షించుచు
రమ్యముగ ప్రతిముంగిట రమణి ప్రత్యక్షమయ్యె!

—బాణగిరి వసుంధర

ఉంటుంది. మరో సంవత్సరంలో రిటైర్ కాబోతున్నారు. నాకు వ్యాపకమేదీ లేకపోవడంతో అతనితో మాటలు కలిపి స్నేహం పెంచుకున్నాను. నాలాగ రోజు ఆయన మందిరానికి రాలేదు. అప్పుడప్పుడు తీరిక దొరికితే మాత్రం వస్తాడు అలాగే ఈ రోజు వచ్చాడు.

"మొన్నీ మధ్య నేనో చిత్రమైన వ్యక్తిని చూశాను. మళ్ళీ అతడు కనిపిస్తాడేమోనని..."

"ఆ బుర్రమీసాలాయనేనా?" అడిగాడు రాజారాం నా మనసు అద్దం పడుతున్నట్లు.

"ఔను. అతడిని మీరెరుగుదురా?" అన్నాను మరింత ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

"నేను గతంలో పనిచేసిన గ్రామమే అతడిది. నాకు బాగా తెలుసు."

"ఇక్కడికి ఎందుకొచ్చాడు?"

"ఇక్కడే మిటి అక్కడే మిటి అన్నిచోట్లకు తిరుగుతాడు"

"స్క్రూ లూజా"

"అబ్బే, అదేం లేదు"

"మరి"

ఆయన పట్ల నా ఉత్సుకతను గమనించినట్లుంది.

నోరు విప్పాడు రాజారాం.

చెవులప్పగించాన్నేను.

○ ○ ○

"మాటి మాటికి వచ్చి నన్ను విసిగించకండి. సేవలు చేస్తున్నట్లు నటించి నాకు చేరువ అవాలని అనుకోవద్దు. మీరంతా నా బంధువులు. మీకిక్కడ అడ్డేమి ఉండదు. ఇష్టం వచ్చినన్నాళ్ళు ఉండండి. ఏం కావాలంటే అది తినండి. అంతే తప్ప నా ఆస్తిపాస్తుల జోలికి రావద్దు. ధనార్జనే ధ్యేంగా ఇన్నాళ్ళూ డబ్బు సంపాదించాను. ఇకనుంచి ఖర్చుపెడతాను. నా కోసం మీ కోసం కాదు. ఆర్తులకు అన్నార్తులకు. దేవుడికి దయ్యానికి. నా ఆస్తి అంతా కరిగిపోయేవరకు ఖర్చు పెడతాను" ఉద్వేగంతో ఊగిపోయాడు ఉమాపతి.

ఆ మాటలో వచ్చినవాళ్ళంతా మరి కిమ్మనకుండా అక్కడనుండి జారుకున్నారు.

ఉమాపతి ఆ ఊరికి మకుటంలేని మహారాజు. తాత ముత్తాతల నుండి సంప్రాప్తించిన ఆస్తిపాస్తుల్ని తన హయాంలో నాలుగింతలు చేశాడు. అతడికున్న ధనదాహం చెప్పనలవి కాదు. డబ్బు కోసం ఎంత కఠినంగానైనా వ్యవహరిస్తాడు. తన భూముల్ని సాగు చేసి సిరులు కురిపించిన రైతు కూలీలకు చాలీచాలని

డబ్బులిచ్చేవాడు. పేదల అవసరాలను ఆసరా చేసుకుని వారిని ఆదుకున్నట్లు అప్పులిచ్చి వారి నుండి అధిక వడ్డీలు గుంజేవాడు. కట్టలేని వాళ్ళచేత తన పొలంలో వెట్టిచాకిరి చేయించేవాడు. ఏనాడు ఏ సత్కార్యానికి పైసా విరాళమిచ్చిన పాపాన పోలేదు. ఊళ్ళోకొచ్చిన అధికారులకు, రాజకీయ నాయకులకు ఆడంబరంగా అతిథి సత్కారాలు చేసి వాళ్ళందర్నీ తన గుప్పిట్లో పెట్టుకుంటాడు. తన పరపతిని ఉపయోగించి గ్రామంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలవకుండా జాగ్రత్త పడతాడు. ఊళ్ళో అందరూ తనమీదే ఆధారపడాలన్నది అతడి ధ్యేయం. చదూకుంటే ప్రజలెక్కడ తెలివిమీరిపోతారోనని ఊరికి కనీసం జూనియర్ కాలేజీ రానివ్వలేదు. తన కొడుకును మాత్రం పట్నం పంపించి పై చదువులు చెప్పించుకున్నాడు.

వయసు రావడంతోనే తనయుడికి ఎంతో ఆర్భాటంగా కళ్యాణం జరిపించాడు. వివాహానంతరం పై చదువులకు విదేశం పంపే ఏర్పాట్లు చేస్తూ ఉండగా విధి అతడిని వెక్కిరించింది. కారు యాక్సిడెంటులో ఒక్కగాని ఒక్క కొడుకు ప్రాణాలు కోల్పోయాడు. పుత్రశోకంతో ఉమాపతి కుమిలిపోగా భర్త ఎడబాటును భరించలేక కోడలు పిచ్చిదైంది. ఆమె అనుచిత చర్యలకు బెంబేలెత్తిపోయి, ఆమెను మెంటల్ హాస్పటల్‌లో చేర్పించాడు. రోజురోజుకి పిచ్చి ముదిరిపోతున్నదే తప్ప మెరుగుపడే సూచనలు లేవు. తను ఆగర్భ శ్రీమంతుడైనా వారసుడు లేకపోవడంతో తన ఆస్తిపాస్తులన్నీ మూటగట్టి ఎవరికివ్వాలో తెలీడంలేదు.

అంతులేని ఆలోచనల వల్ల ఉమాపతికి బి.పి. పెరిగింది. పెరాలసిస్ స్ట్రోక్ రావడంతో కుడి చెయ్యి చచ్చుబడిపోయింది. వరుసగా సంభవిస్తున్న ఈ పరిణామాలన్నీ తన పాప ఫలితమే అనుకున్నాడు. అంతే, అప్పటినుండి అతడిలో పశ్చాత్తాపం మొదలైంది.

లంకంత కొంప, పుట్టెడంత ఆస్తి ఉన్నా వారసులు లేని ఉమాపతి నుంచి అంతో ఇంతో రాలకపోతుందా అనుకుని సంబంధీకులంతా బెల్లం చుట్టు చీమలు చేరినట్టు అతడిని ఆశ్రయించారు. శుశ్రూషలు చేస్తూ అతడికి దగ్గరయేందుకు ప్రయత్నించి భంగపడ్డారు.

చివరికి తన సిరిసంపదల్ని సత్కార్యాలకు వెచ్చించాలన్న నిర్ణయానికొచ్చాడు ఉమాపతి. తనదేదీ కాదనుకున్నప్పుడే మనిషి మనసు భగవంతుడి మీద మరలుతుంది. అప్పటినుంచే మంచి పనులు చెయ్యాలన్న సంకల్పం కలుగుతుంది. అందుకేనేమో సర్వసంగ పరిత్యాగ అయితే తప్ప మనిషికి మోక్షం సిద్ధించదంటారు సిద్ధులు.

"బాబుగారూ!"

పాలేరు పిలుపుకు ఉలిక్కిపడి చూశాడు ఉమాపతి. అతడి మాటల్లో ఆందోళన ధ్వనిస్తోంది.

విషయం ఏమిటన్నట్లు భృకుటి ముడిచాడు ఉమాపతి.

"బిడ్డ వళ్ళు కాలిపోతోందయ్యా. డాట్టరు కాడికి తీసుకెళ్ళేందుకు పైసలు లేవయ్యా. వడ్డీతో కలిపిచ్చుకుంటాను ఓ వందిచ్చి పున్యంగట్టుకోండి" ప్రాధేయపడ్డాడు పానకాలు.

"మరేం భయంలేదు. తగ్గిపోతుంది. డాక్టరుకు చూపించు" అంటూ ఐదొందల కాగితమిచ్చాడు.

"అంత డబ్బు నేను తీర్చలేనయ్యా. వంద చాలు" అన్నాడు పానకాలు.

"పరవాలేదు, పట్టుకెళ్ళు తిరిగి ఇవ్వనక్కర్లేదు. నీ పిల్లాడు బావుంటే నాకంతే చాలు" అన్నాడు ఉమాపతి.

యజమాని ధాతృత్వానికి అచ్చరువొందాడు పానకాలు.

మరునాడు ఏడుస్తూ కూర్చున్న పానకాలు భార్యను చూసి "ఇంకా డబ్బు ఏమైనా అవసరమా?" అని అడిగాడు ఉమాపతి.

"వద్దయ్యా. చేసిన ఉపకారం చాలు. మీకాడ డబ్బు అట్టుకెళ్ళకపోయినా బావుండేదేమో!" వెక్కి వెక్కి ఏడుస్తూ అంది సీతాలు.

ఆమె బిడ్డ పోయాడని అర్థమైపోయింది ఉమాపతికి. ఇంతవరకు తను ఉత్తినే ఎవరికి పైసా సహాయం చేసిన పాపాన పోలేదు. అందుకే తన ధర్మం ఇలా వికటించిందనుకున్నాడు. అంతలోనే మొన్న జరిగిన సంఘటన మదిలో మెదిలింది. ఊళ్ళో ఓ పేద గర్భిణీకి ఆపరేషన్ అనివార్యమని తెలిసి ఆమెకు ఆర్థిక సాయం చేస్తే భూమ్మీద పడ్డ నలుసు పురిట్లోనే కన్ను మూసింది. తన చేతుల మీదుగా పోయిన డబ్బు బాధితులను ఏమాత్రం ఆదుకోకపోగా వారికి మరింత హాని కలిగిస్తుందని ఈ రెండు సంఘటనలు రుజువు చేశాయి. దాంతో ఉమాపతి ఇతరుల ద్వారా దానధర్మాలు చేయాలన్న నిర్ణయానికొచ్చాడు. ఎలాగో అలాగ తన డబ్బు సత్కార్యాలకు వినియోగింపబడాలన్నదే అతడి ధ్యేయం.

○ ○ ○

మిస్టరీ ఛేదించాడు రాజారాం.

■